విశాలాంధ్ర
అనకాపల్లి
బుధవారం 11, సెప్టెంబర్, 2024

జె.వి.పాలెం పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డీఈఓ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని జంగులూరు వెలంపాలెం గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. అప్పారావు సందర్శించారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన సందర్భంగా విద్యార్థులు రాగి జావ త్రాగే సమయంలో ఆయన కూడా జావ త్రాగారు. అనంతరం ఉపాధ్యాయల సమస్యలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా ప్రధాన కేంద్రంలో గల నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకర్రావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం, ఏఐఎఫ్టియు కార్యదర్శి సిహెచ్ రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.లోకనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని అన్నారు. రోజు రోజుకీ పరిస్థితి దిగజారిందని, ఈ పరిస్థితిని అధిగమించి స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రజలందరూ ఐక్యంగా కలిసి పోరాడాలని, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో గతంలో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడగా ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేశారని, విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని, ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది రోజుకు 10 కోట్లు నష్టం రాగా, నేడు రోజుకు 15 కోట్లు చొప్పున నష్టం వస్తున్నదన్నారు. విశాఖ స్టీల్ దేశంలోనే నాణ్యమైన డిమాండ్ ఉన్న స్టీల్ అని, కావాలనే ఉత్పత్తి తగ్గించి కేంద్ర బీజేపీ విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర స్టీల్ మంత్రి కుమార స్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మలు సందర్శించారని విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారని గుర్తు చేశారు. 45 రోజుల్లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తానని, మోడీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించారని, నేటికి రెండు మాసాలు దాటినా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆరోపించారు. సెయిల్‌లో విలీనం చేయడానికిగానీ, సొంత గనులు సమకూర్చడానికి గానీ వర్కింగ్ క్యాపిటల్‌కు బ్యాంకులు హామీనివ్వడానికి గానీ ఎన్.ఎం.డి.సి నుండి కొంత కాలం ఇనప ఖనిజాన్ని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు అప్పుగా ఇవ్వడానికి గానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టి ప్రత్యేక హోదా లేకుండా చేసి, ఉన్న ఏకైక భారీ పరిశ్రమను విదేశీ కంపెనీలకు అమ్ముకోవడం ఏమి దేశభక్తో? అర్థం కావడం లేదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు హామీనిచ్చిందని ఇప్పుడు దాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, డి.శ్రీనివాసరావు, బిశెట్టి అప్పారావు, కాపుసెట్టి అప్పారావు, పి.పరమేశ్వరరావు, నాయుడు,బొమ్మల రాము,జి .అప్పారావు. కాళ్ల తేలయ్య బాబు, కె.త్రినాథ్, కొన లక్ష్మణ్, వీరచారి, నరలశెట్టి సత్యనారాయణ, తాకాశి వెంకటేశ్వరరావు, ప్రసాద్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను కాపాడడానికి కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్లో విలీనం చేసి పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సిఐటీయు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను విరమించు కోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖ ఉక్కు తెలుగువారి హక్కు అని స్టీల్‌ప్లాంట్ సాధనకు 52 మంది ప్రాణం త్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే సహించేదిలేదన్నారు. కోట్ల విలువచేసే స్టీల్ ప్లాంట్ స్థలాలు, పరిశ్రమను ప్రైవేటు వారికి కట్టబెట్టడానికి జరిగే కుట్రలను ప్రజానీకం ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు మండల కన్వీనర్ కే.సోమనాయుడు, దూళి వెంకయ్యనాయుడు, కాకి సూరిబాబు, వడిసెల రాము, పింకీ శ్రీను, వై.అప్పలరాజు, కే.మహేష్, లోవ తదితరులు పాల్గొన్నారు.

జీవో 85ను రద్దు చేయాలంటూ వైద్యులు నిరసన

విశాలాంధ్ర - గొలుగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 85 రద్దు చేయాలంటూ కృష్ణదేవి పేట వైద్యాధికారులు డాక్టర్ హరి ప్రవీణ్, గాయత్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రభుత్వ వైద్యాధి కారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 85తో క్లినిక్‌లో 15% నాన్ క్లినిక్‌లో పనిచేస్తున్న వారికి 30 శాతానికి కుదించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాన్ క్లినిక్‌లో పనిచేసేవారికి 50 శాతం, క్లినిక్‌లో పనిచేసేవారికి 30శాతం ఉండేదన్నారు. దీంతో ప్రస్తుత జీవోతో శాతాన్ని తగ్గించటంతో పాటు అనేక బ్రాంచ్ లు ఉన్న వాటిని 5 బ్రాంచులుగా కుదించడం దారుణం అన్నారు. 11, 12 తేదీలలో వైద్య సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుందని, 13వ తేదీన అత్యవసర సేవలు తప్ప మిగిలిన సేవలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. 15న ఛలో విజయవాడ ర్యాలీ నిర్వహిస్తామని అన్నారు. 16వ తేదిన పూర్తి స్థాయిలో నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి మహిళకు గాయాలు

విశాలాంధ్ర - గొలుగొండ: అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో మండలంలో పాత జోగంపేట గ్రామానికి చెందిన వాసం త్రిమూర్తులమ్మకు చెందిన తాటాకు ఇల్లు సోమవారం అర్ధరాత్రి కూలిపోయింది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గోడ కూలిపోవడంతో వాసం త్రిమూర్తులమ్మకు గాయాలు కావడంతో వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఇంటి గోడ కూలిపోవడంతో ఇంటి లోపల ఉన్న గృహోపకరణ వస్తువులన్నీ ధ్వంసం అయ్యాయని తనని ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తకోట విద్యార్థినీలు

విశాలాంధ్ర - రావికమతం: కొత్తకోట పెంటపాటి సూర్యారావు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థినీలు బంటు జనని, కొప్పుల పూజిత జిల్లా స్థాయి ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్‌లో భాగంగా హైజంప్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపికయ్యారు. త్వరలో గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.రామచంద్ర రెడ్డి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కుసుమంచి నాగేశ్వరావు తెలిపారు.

ముంపు బాధితులకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని చాకలిపేట ముంపుకు గురి కావడంతో ఆప్రాంతంలో నివశిస్తున్న వారికి సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, తహశీల్దార్ జైప్రకాష్, డిటి త్రినాధ్, వేములపూడి అప్పారావు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న క్రీడా మైదానం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం చెరువును తలపిస్తుంది. చిన్న పాటి వర్షం కురిసిన క్రీడా మైదానంలో వర్షం నీరు నిలిచి పోతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను స్పందించి సమస్య పరిష్కారం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడుకు సత్కారం

విశాలాంధ్ర - రావికమతం: వివిధ మండలాల్లోని భవిత కేంద్రాలలో పనిచేస్తున్న సహిత విద్య రిసోర్స్ పర్సన్ ప్రత్యేక ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు టాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడంపై బాపట్ల జిల్లా మానవ వనరుల శిక్షణా కేంద్రం నందు నిర్వహించిన విజన్ 2025 - ఇన్ క్లూజివ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన అనకాపల్లి జిల్లా మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడుని ఘనంగా సన్మానించారు. బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ జ్యోత్స్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహితవిద్య సహిత విద్యా విభాగం అధికారి జి.మల్లికార్జునరావు జిల్లా ప్రత్యేక ఉపాధ్యాయులు శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం అధికారులు, బాపట్ల జిల్లా సహిత విద్యా విభాగం అధికారులు, కీ రిసోర్స్ పర్సన్ సునీల్, ఐ.ఈ.ఆర్.పి లు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర - రాంబిల్లి: ఎస్పీ ఎం.దీపిక రాంబిల్లిలో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మకమైన ఎన్.ఏ.ఓ.బీ ను సందర్శించారు. అనంతరం రాంబిల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రాంబిల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలని, కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తుల కదలికల సమాచారం ముందస్తుగా తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సముద్ర స్నానాలు చేసే యువతకు హెచ్చరికలు జారీ చేయాలని స్థానిక మత్స్యకారులతో కలసి కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించా లన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం, రోడ్డు భద్రత నియమాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ఆకస్మిక/ డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. బెల్ట్ షాపులపై పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కట్టడి చేయాలన్నారు. రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు గూర్చి ఆరా తీశారు. ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీపడదగ్గ కేసులలో ఇరు పార్టీలకు కౌన్సిలింగ్ చేసి స్వచ్ఛందంగా రాజీ పడేలా చేసి తద్వారా కేసులు సంఖ్యను తగ్గించాలన్నారు. ఎస్పీ వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, రాంబిల్లి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.నర్సింగరావు, ఎస్సై రమణ సిబ్బంది ఉన్నారు.

జనావాణికి విశేష స్పందన

విశాలాంధ్ర - నక్కపల్లి: జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నక్కపల్లి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి బోడపాటి శివ దత్తు జనావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం నక్కపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. రాజయ్యపేట గ్రామానికి చెందిన కుందేటి శ్రీను ఎస్సీ కాలనీలో ఉన్న సమస్యలపైన నెల్లిపూడి గ్రామంలో ఉన్న పలు సమస్యలపైన వినతలు స్వీకరించారు. స్వీకరించిన వినతులను పార్టీ కేంద్ర కార్యాలయంకు పంపిస్తున్నట్లు శివ దత్తు చెప్పారు. ఆయనతోపాటు జనసేన పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురుందాసు అప్పలరాజు, పిక్కి స్వామి, పాము గణేశ్వరరావు, యలమంచిలి చంద్రరావు తదితరులు ఉన్నారు.

చోడవరాన్ని మరో విజయవాడ చేయొద్దు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణాన్ని మరో విజయవాడ మాదిరి వరద ప్రమాదాల్లో మునిగిపోయేట్లు చేయవద్దని సి.పి.ఐ. జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చోడవరం మేజర్ పంచాయతీలో సర్వే నెం.83లో అతిపెద్ద పారిశుధ్య వనరుగా ఉపయోగపడే పాత చెరువును గ్రావెల్ మట్టితో కప్పివేయడం వలన, చోడవరం లోతట్టు ప్రాంతాలైన ద్వారకా నగర్, రెల్లివీధి, కో - ఆపరేటివ్ కాలనీ, బాలాజీ నగర్, గునిశెట్టివారి వీధి, కోట వీధి, గండి కాలనీ, ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోతున్నాయని అన్నారు. ఈ మధ్య కాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు, పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయిం అయ్యాయని తెలిపారు. చెరువులు, కాలువలు, డ్రైనేజీలు ఆక్రమణకు గురి కావడంతో రహదారులే చెరువులయ్యాయని తెలిపారు. పాత చెరువు కబ్జాపై గతంలో సీపీఐ హై కోర్టును ఆశ్రయించగా, డబ్ల్యూ.పి. 9882/24, ఇచ్చిన ఆర్డర్ ప్రకారం సంబంధించిన రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు కబ్జాకు గురైన పాత చెరువులో గ్రావెల్ మట్టిని తొలగించి, చెరువును కాపాడాలని ఆర్డర్ ఇవ్వగా, నేటికీ అధికారులు కనీసం గ్రావెల్ మట్టిని కూడా తొలగించలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, బడాబాబులు చేతుల్లో కబ్జాకు గురైన పాత చెరువును కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి. కార్యదర్శి బుద్ధా అమర్నాథ్, కాంతికుమార్, సదరం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై కలెక్టర్ స్పందించాలి

విశాలాంధ్ర - కసింకోట: అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కార్మికులు సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 10వ రోజు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు సేవలు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్వైజర్ల నిరసనలను అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరం అని వాపోయారు. (దళారీ) కాంట్రాక్టర్లను పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో వారు ఆటలాడుకుంటున్నారని లక్ష్మణ మండిపడ్డారు. కార్మికుల కష్టార్జితం దాచుకున్న పిఎఫ్ డబ్బులు కూడా కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులఅందరికీ ఈ నెల 15వ తేదీలోగా బకాయి ఉన్న అన్ని నెలల జీతాలు చెల్లించాలని, జీఓల ప్రకారం జీతాలు పెంచాలని, 2021 జూన్ నెల నుండి రావాల్సిన వేతనానికి తగిన పిఎఫ్ డబ్బులు మొత్తం లెక్కలు చెప్తూ జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్. సంతోష్, అడ్డా ప్రసాద్, నూకరాజు, రామ్ ప్రసాద్, కిరణ్, సుధీర్, వర ప్రసాద్, వెంకట లక్ష్మి, జగన్నాధ్‌రావు, నారాయణరావు, సన్యాసిరావు, కృష్ణ శివ, వరలక్ష్మి, రామకృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

ఒప్పంద స్టాఫ్ నర్స్‌లు నిరసన

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వాసుపత్రుల్లో ఏఎన్ఎంలను, స్టాఫ్ నర్స్‌ల పోస్టుల్లో సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెంబర్ 115 ఉత్తర్వులను వెనక్కి తీసుకో వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఒప్పంద స్టాఫ్ నర్సులు ఆందోళన బాట పట్టారు. కే.కోటపాడు వైద్య విధాన పరిషత్ యాభై పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న వీరంతా కొద్దిసేపు నిరసన చేపట్టారు. ఒప్పంద స్టాఫ్ నర్స్‌ల సంఘం నాయకురాలు కే.అప్పలనర్స మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఈనెల 4వ తేదీన 115 జీవోను విడుదల చేసిందన్నారు. గత 15 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలోనే నియామకాలు జరుగుతు న్నాయని అన్నారు. పదేళ్ల నుండి రెగ్యులర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని అన్నారు. తక్షణమే కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, రేవతి, పుష్పకళ, పార్వతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పశువుల పెంపకం

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని వైనం

పశువులను కట్టేసిన దృశ్యం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని ఈదటం గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పశువుల అడ్డాగా మారింది. పాఠశాల తరగతి గదులు వరండా, పాఠశాల ఆవరణలో పశువులు, మేకలు కట్టివేయడం, వదలంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పశువుల యజమానులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయ. పాఠశాల ప్రహరీ గోడకు గతంలో ఏర్పాటు చేసిన గేట్లు తొలగించారు. దీంతో పాఠశాల సమీపంలో ఉన్న వారు వారికి చెందిన పశువులు, మేకలు, గొర్రెలు పాఠశాల ఆవరణలోకి వదులుతున్నారు. అంతేగాక పాఠశాల తరగతి గదులు వరండాల్లోకి వదిలి వెళ్తున్నారు. రాత్రంగా గొర్రెలు, మేకలు అక్కడే ఉండి వ్యర్థాలు విడుదల చేస్తున్నాయి. వీటి దుర్వాసనలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. అంతేగాక పాఠశాల ప్రహరీ గోడ కూడా ఆక్రమించుకోని వాహనాలు, షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈవిషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణను ప్రశ్నించగా పలు పర్యాయాలు పశువుల యజమానులకు చెప్పినా పట్టించుకోలేదని, తిరిగి గొడవలకు దిగుతున్నారని తెలిపారు. పశువుల వ్యర్థాలు ప్రతీ రోజూ తాము శుభ్రం చేయించుకుంటున్నామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి కెఎస్ గాంధీని వివరణ కోరగా పాఠశాల ఆవరణ, వరండాల్లో పశువుల పెంపకం చేస్తున్నారని హెచ్ఎం ఫిర్యాదు మేరకు పలు పర్యాయాలు సర్పంచ్, ఎంపిటిసిల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. పాఠశాల చుట్టు పక్కల ఆక్రమణ, పాఠశాల ఆవరణలో చెత్తా చెదారంపై పంచాయతీ కార్యదర్శి వరహాలబాబును వివరణ కోరగా గ్రామస్తులు వేస్తున్న చెత్తను గతంలో జెసిబితో తొలగించామని, మరలా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆవరణలో ఉన్న చెత్తా చెదారం

పాఠశాల ప్రహరీ ఆక్రమణ

వరండాలో పశువులు వేసిన వ్యర్థాలు

ఘనంగా అనకాపల్లి ప్రెస్ క్లబ్

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - కసింకోట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఏపీ డబ్ల్యూ జేఎఫ్) యూనియన్, అనకాపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం అనకాపల్లి వివేకానంద హాల్లో ఘనంగా జరిగింది. గతవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సిహెచ్ శశికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలిమేర నాగ శ్రీనివాసరావు, కోశాధికారిగా మొల్లెటి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల సతీష్, జాయింట్ సెక్రటరీగా పెంటకోట సురేష్ లను సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ఈశ్వరరావు లు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, యూనియన్ బలోపేతం దిశగా నూతన కార్యవర్గం పనిచేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బయ్యా కొండల రావు, మాజీ కార్యదర్శి రామకృష్ణ లను నూతన కమిటీ సభ్యులు సన్మా నించారు. అనంతరం అనకాపల్లి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు సిహెచ్ శశి కుమార్ కుమార్ మాట్లాడుతూ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా కార్యవర్గ సభ్యులందరూ కృషి చేస్తామని, యూనియన్ బలోపేతానికి పారదర్శకంగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తిమ్మాపాత్రుని రమేష్, సీనియర్ జర్నలిస్ట్ అజయ్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ఎస్.కె చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అమర్ నోరు అదుపులో పెట్టుకో

- బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర - కసింకోట: జగన్ రెడ్డి ఒకటో నెంబర్ సైకో అయితే రెండో నెంబర్ సైకోగా కోడిగుడ్డు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యవహరిస్తున్నాడని మాజీ శాసనమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అమర్నాథ్ ను ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసినందుకు హెచ్చరించారు. బుడమేరు వాగు గట్లపై ఉన్న మట్టిని 500 కోట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని, కాలువను ఏడు కిలోమీటర్లు ఆక్రమించుకొని వైసిపి నాయకులు మంత్రులు, శాసనసభ్యులు ఆ స్థలాన్ని ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారని దానివల్ల విజయవాడ లో వరదలు రావడానికి ముమ్మాటికి వైసిపి ప్రభుత్వ పనితీరే కారణమని, ఈ విషయం విజయవాడ వెళ్తే అక్కడ ప్రజలు మీకు బుద్ధి చెప్తారని, ఎనిమిది రోజులు కావస్తున్న యువజన శృంగార రసి కామపార్టీ సభ్యులు ఏ ఒక్కరు కూడా నేటికి కూడా బాధితులు పట్ల సానుభూతి గాని, సహాయం గాని, పసిపిల్లలకు చిన్న పాల ప్యాకెట్‌ను కూడా అందించలేని అమర్నాథ్ నీకు మాట్లాడే నైతిక హక్కులేదని, గోదావరి నదిలో 60 మంది చనిపోవడానికి, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి, 53 మంది ఇటీవల జరిగిన బుడమేరు వరదలకు 40 మంది కారణమైనందుకు మిమ్మల్ని నేరస్తులుగా 2024 ఎన్నికల్లో శిక్షించారని, ఇంకా మీలో బుద్ధి రాలేదని, ప్రకాశం బ్యారేజ్ ని కూల్చడానికి నందిగాం సురేష్, తలసిల రఘురాం కుట్ర వల్ల ఐదు పడవల్ని నదిలో వదిలి ప్రజలు చనిపోవడానికి ప్రయత్నాలు విఫలం అవడంతో సైకో జగన్ 1, సైకో 2 అమర్నాథ్ చాలా బాధపడుతూ ఉన్నారని,ప్రజలను చంపడానికే, హింసించడానికి,అరాచకాలు చేయడానికి,అవినీతి అక్రమాలు దోపిడీ, మీకు నిత్యకృత్యం అయిపోయిందని, గత ఎనిమిది రోజులుగా మంత్రివర్గం, శాసనసభ్యులు,తెలుగుదేశం పార్టీ శ్రేణులు, నిరంతరం బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, అనేకమంది దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలు ప్రకటించిన విషయాన్ని మీరు జీర్ణించుకోలేకపోతున్నారని,సైకో జగన్ రెడ్డి ప్రకటించిన కోటి రూపాయలు, బొత్స సత్యనారాయణ ప్రకటించిన కోటి రూపాయలు నేటికీ కార్యక్రమం రూప%శీ% దాల్చలేదని, ఎంతసేపు అమరావతి ముంచడానికి, చంద్రబాబు నాయుడు ఇల్లు మునిగిపోయిందని ప్రచారం చేయడానికి గత పది సంవత్సరాల నుండి ఇదే నేర్చుకున్నారని, అనకాపల్లి ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపిన ఇంకా తెరపైకి రావడానికి నోటికి వచ్చిన మాట్లాడితే ఇకపై సహించేది లేదని ఖబర్దార్ అమర్నాథ్ నీ అవినీతి చక్రమాలని త్వరలో సీరియల్ గా బయటపెడతామని దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నాగ జగదీష్ సవాల్ విసిరారు. పబ్లిసిటీలు చేసుకోవడానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ముఖ్యమంత్రిగా పేరుగాంచారని, తెలుగుదేశం పార్టీ హయాంలో ఏ విపత్తు జరిగిన తక్షణమే ప్రజలను ఆదుకోవడానికి చంద్రబాబు నాయుడు ముందు ఉంటారని,నిరంతర కృషీవలుడు, బాధితులు పట్ల బాధ్యతగా ఉంటారని, వారిని ఏ విధంగా ఆదుకోవాలా అధికారి యంత్రాంగాన్ని పరుగులు తీయించిన విషయంవిజయవాడ ప్రజానీకానికి తెలుసునని, నాడు హుదూహూద్ తుఫాను సమయంలో విశాఖపట్నం అల్లాకల్లోలం అయిపోతే తొమ్మిది రోజుల్లో యధా స్థానానికి తీసుకొచ్చి విశాఖ ప్రజల మన్నల పొందిన విషయం కూడామరిచిపోయావా అమర్నాథ్, విశాఖపట్నం నాలుగు స్థానాల్లో కూడా నేటికీ కూడా మీ పార్టీకి అవకాశం ఇవ్వలేదని, ఆంధ్రప్రదేశ్లో అత్యధిక ఓట్లతో ఓడిపోయిన ఘనత సాధించిన అమర్నాథ్ అవాకులు చావాకులు మాని ప్రజలకు సేవ చేయడానికి ముందుకు రావాలని అమర్నాథ్ కు నాగ జగదీష్ హితువు పలికారు.

నవరాత్రి పూజలందుకుంటున్న కార్యసిద్ధి గణపతి

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయంభూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం లో స్వయం భూ కార్య సిద్ధి గణపతి నవరాత్రులు సందర్భంగా భక్తులు, ప్రముఖులచే విశేష పూజలు అందుకుంటున్నారు. నవరాత్రుల్లో నాలుగవ రోజైన మంగళవారం స్వామి సింధూర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే గంటలకు స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, ఆలయ చైర్మన్ ఉప్పల సతీష్ పుణ్య దంపతులు, భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం లక్ష్మీ గణపతి హెూమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణా ధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు, సంగీస విఘ్నేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. పి.ఎస్.పేట. శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం లో మంగళవారం లక్ష్మీ గణపతి హెూమం, శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి నవావరణ అర్చన, పాలాభిషేకం జరిపించారు. మన్యుసూక్త హెూమం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణము, తదితర కార్యక్రమాలు వేద పండితులు ఆధ్వర్యంలో సాంప్రదాయ బద్దంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పుత్రేవు శ్యామ్ ప్రసాద్ తెలియజేసారు. ఆలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమంనకు భక్తులు, దాతలు ఉదారంగా సహకరించవలసినదిగా ఆయన కోరారు.

వైద్య సిబ్బంది ఆందోళన

విశాలాంధ్ర - నక్కపల్లి: ఏఎన్ఎం నుంచి జీఎన్ఎమ్ ఇంటెన్సఫైడ్ వారికి స్టాఫ్ నర్స్‌ల ఉద్యోగాలను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి ఎదుట విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు కోటేశ్వరరావు, చిన్ని ప్రసాద్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్వీస్‌లో ఉన్న ఏఎన్ఎంలకు ఇంటెన్సిడ్ ద్వారా జీఎన్ఎమ్‌లు పేరుతో నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పి 18 నెలలపాటు దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శిక్షణ ఇవ్వడం జరిగిందని, దీనివల్ల నర్సింగ్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ గతంలోనే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా హైకోర్టు నందు నర్సింగ్ వ్యవస్థకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ పిటిషన్ దాఖలు చేయగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇంటెన్సిఫైడ్ వారికి కేవలం నైపుణ్య శిక్షణ మాత్రమే ఇస్తున్నామని వారికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇవ్వడం లేదని తప్పుడు సమాచారం అందించారని అన్నారు. ప్రస్తుతం జీవో నెంబర్ 115 విడుదల చేసి ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్న వారికి స్టాఫ్ నర్సులు ఉద్యోగాలు ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ అత్యవసర విధులు కొనసాగిస్తూ దశలవారీ నిరసనకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో ఆందోళన చేపట్టడం జరుగుతుందని, ఈ ఆందోళన న్యాయం జరిగేంత వరకు కొనసాగిస్తామని చెప్పారు. ఆందోళన కార్యక్రమంలో విజయ, రత్నం, వరలక్ష్మి, కృష్ణవేణి, జ్యోతి తదితరులు ఉన్నారు.

తోట నగేష్‌కు పలువురు సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మెమోరియల్ అవార్డును అందుకున్న జనసేన నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్‌ను జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సన్మానించారు. తోట నగేష్‌ను పూలదండలు, శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా బోడపాటి శివదత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాష్ట్రానికి ఒకరిని చొప్పున ఎంపిక చేసి అవార్డులు పంపిణీ చేశారని, ఇందులో ఆంధ్రప్రదేశ్ నుండి తోట నగేష్‌కు అవకాశం దక్కిందన్నారు. తోట నగేష్ ఈప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తోట నగేష్ రాజకీయ గురువుగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం పలు రాజకీయ పార్టీల్లో ఉన్న నాయకులంతా ఒకప్పుడు ఆయన శిష్యులే అన్నారు. జనసేన పార్టీలో త్వరలో ఉన్నత పదవులు అలంకరిస్తారని బోడపాటి శివదత్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకేటి గోవిందరావు, కొప్పిశెట్టి బుజ్జి, మంచాల శివాజీ, పాము గణేష్, కురందాసు అప్పలరాజు, పిక్కి స్వామి, చంద్రరావు, సుధారాజు, రవిరాజు, ఇంజరపు సూరిబాబు, ఐఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోషక సవరణ చేసుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట వ్యవసాయ డివిజన్‌లో నక్కపల్లి మండలం గొడిచర్ల, దేవవరం, నామవరం, గునుపూడి గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న వివిధ పంటలను, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అనకాపల్లి ప్రధాన శాస్త్రవేత్త డా. భవాని, బి సి టి కే వి కే శాస్త్రవేత్త డా. వి ప్రసాద రావు, పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమా ప్రసాద్ పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సూచనలు చేశారు. నీట మునిగిన వారి పంటను పరిశీలించి, నీరు బయటకు పోయే ఏర్పాటు చేయాలని, ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ పొటాష్ వేయాలన్నారు. నీరు బయటకు తీసిన తరువాత కార్బీడిజమ్ 1 గ్రామ్ కార్బెండేజి మాంకోజెబ్‌ను 2గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, అధిక తేమ వల్లన పాముపొడ తెగులు ఆశించే అవకాశం వుంది కావున ప్రొపికొనజోల్ 1 మి.లి , హెక్సాకోనజోల్ 2 మి.లి. పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, వివిఏ రాకేష్, సత్యనారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.